క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని వీరమ్మ పార్క్ వద్దగల ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మంగళవారం వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దుప్పట్లు, టోపీలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కన్వీనర్ ఎండీ మున్వర్ మాట్లాడుతూ శీతాకాలంలో వృద్ధులకు చలి నుంచి రక్షణ కల్పించడానికి దుప్పట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకురాలు భవానీ, ఉమేర్, ఖలీల్, షఫీయుద్దీన్, గౌస్ మొహిద్దీన్, సుబ్బయ్య, శ్రీనివాస్, చిన్నారెడ్డి, సత్యనారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక మండపంలో దుర్గమ్మకు పూజ



భజన చేస్తున్న భవానీ భక్తులు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో తిమ్మరాజు కాలనీలో మంగళవారం రాత్రి వైభవంగా భవానీల భజన కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతానికి చెందిన నడిపూడి రమణ ఆధ్వర్యంలో అరటి డొప్పలతో ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి భవానీలు భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో మజ్జి శ్రీను, సూరి రాజేష్, బూడిద శ్రీనివాసరావు, వాడపల్లి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



భీమవరంలో ఫెన్సింగ్ క్రీడాకారిణి ధృతి సమీక్షను అభినందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్య మని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మలేషియాలోని కౌలాలాంపూర్‌లో నిర్వహించిన మూడవ ఎంఎంఎఫ్ మినిమ్ ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ అండర్-12 బాలికల ఈపి పోటీల్లో భీమవరం పట్టణం వెస్ట్‌బెర్రీ స్కూల్ విద్యార్థిని మంతెన ధృతి సమీక్ష కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్న సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంజిబాబు అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎం ఫెన్సింగ్ క్లబ్ కోచ్ గుణ్ణం కృష్ణమోహన్, చెనమల్ల చంద్రశేఖర్, పత్తి హరివర్ధన్, కొప్పినీడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోపి మూర్తి విజయంపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

కాళ్ల: ప్రతిష్టాత్మకంగా జరిగిన ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి విజయం సాధించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జి రామకృష్ణంరాజు, మండల గౌరవాధ్యక్షుడు రవికుమార్ రాజు, మండల సహాధ్యక్షుడు ప్రభుదాసు, మండల మహిళా సహాధ్యక్షురాలు కనకదుర్గ, జిల్లా కౌన్సిలర్ రవిచంద్రకుమార్, మండల కార్యదర్శులు అప్పలనాయుడు,రామ్మూర్తి రాజు,.విష్ణు ప్రసాద్,వర్మ తదితరులు వర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

మానవ హక్కులు-పౌరుల బాధ్యతపై అవగాహన



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాలకోడేరు: భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో మానవ హక్కులు-పౌరుల బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు ఎంబీఏ హెచ్ఓడీ సీహెచ్ రోహిణి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఏబీఎస్ఆర్ మనోహర్, అకాడమిక్ డీన్ డాక్టర్ కురెళ్ల భాస్కరరావు, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

రైతుల పాలిట శాపం.. ఉండి అక్విడెక్టు

- సుమారు 75 ఏళ్ల క్రితం నాటి నిర్మాణం
- చినుకుపడితే రైతుల గుండెల్లో రైళ్లు
- ముప్పు తప్పేదెప్పుడంటున్న రైతులు



ఉండిలో కొద్దిపాటి నీటి ప్రవాహానికే బిగదన్నిన అక్విడెక్టు



శిథిలావస్థకు చేరిన ఉండి అక్విడెక్టు

ఉండి: ఆకివీడు, ఉండి, పాలకోడేరు, గణపవరం మండలాల రైతుల పాలిట శాపంలా మారింది ఉండి అక్విడెక్టు. ఏళ్ల తరబడి పునఃనిర్మాణం చేయకపోతారా అని ఎదురు చూపులు చూస్తున్న రైతులకు నిరాశే మిగులుతుంది. ఉండి నియోజకవర్గంలో అక్విడెక్టును, రైతులను పట్టించుకోవడం లేదు. సుమారుగా 75 ఏళ్ల క్రితం బొండాడ మేజర్ డ్రెయిన్‌పై నాటి అవసరాలకు తగిన విధంగా నిర్మాణం చేపట్టిన ఆ క్విడెక్టు రానురాను రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలోని పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు, యండగండి, ఉణుదుర్రు, చిలుకూరు, మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం, ఉండి, పాలకోడేరు మండలం గరగపర్రు, గొల్లలకోడేరు తదితర గ్రామాలు, ఆకివీడు మండలంలోని పెదకాపవరం, చినకాపవరం తదితర గ్రామాలు, గణపవరం మండలానికి చెందిన జల్లికాకినాడ తదితర గ్రామాలకు చెందిన వరి సాగు సుమారు ఎనిమిది వేల ఎకరాల ఆయకట్టు, ఆక్వా సాగు సుమారు ఐదు వేల ఎకరాలు ఉండి అక్విడెక్టు బారిన పడి ముంపుకు గురవుతుంది. ముఖ్యంగా ఉండి మండలంలోని కోలమూరు, ఉప్పులూరు, యండగండి, ఉణుదుర్రు ప్రాంతాల్లో ప్రతి ఏటా లేదా తుఫాన్లు వచ్చే సమయంలోనూ వేలాది ఎకరాల వరిసాగు నీట మునిగిపోతుంది. దీంతో రైతులు సార్వా, దాళ్వా సీజన్లలో తీవ్రంగా నష్టాలపాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా ఉండిలో అధికారంలో టీడీపీ ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా అనిపిస్తుంది.

అభివృద్ధికి ఆమడదూరం

ఉండి అక్విడెక్టు పునఃనిర్మాణం కాకపోవడంతో ఉండిలోని శివారు ప్రాంతాలు పడవలరేవు, ఉండి తోట, ఎన్నార్పీ అగ్రహారం ప్రధాన గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయాయి. వ్యాపారం, వ్యవసాయం, ఇంటి నిర్మాణాలు జరగకపోవడంతో అభివృద్ధి కానరాకుండా పోయింది. కారణం అక్విడెక్టుపై భారీ వాహనాలు వెళ్లలేకపోవడం. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ఉండి పడవలరేవులో కాలువపై వంతెన నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. దీంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి ప్రారంభమైంది. ఈ వేసవిలో అయిన అక్విడెక్టు నిర్మాణం చేపడితే రైతులకు ముంపు ప్రమాదం ఉండదని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

అక్విడెక్టు నిర్మించాలి



అక్విడెక్టు నిర్మించి సుమారు 75 ఏళ్లు కావస్తుంది. నాటి అవసరాలకు తగిన విధంగా నిర్మించారు. అయితే ఇప్పుడు నీటి ప్రవాహం పెరిగిపోవడం, భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రతి సీజన్‌లోనూ వరిసాగు ముంపుకు గురవుతుంది. ఈ సమస్య పరిష్కారం కావాలంటే తప్పనిసరిగా అక్విడెక్టు నిర్మాణం చేయాలి.

గుండాబత్తుల సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉండి

ప్రతి ఏటా ముంపే



వర్షం కురిస్తే చాలు మా గ్రామంలో వరి పొలాలు నీటిలో తేలియాడతాయి. దీనికి ఎవరిని నిందించాలి. ఎన్నో ఏళ్ల నుంచి అక్విడెక్టు నిర్మాణం చేస్తామని ఊరిస్తున్నారు. కాని నిర్మాణం మాత్రం చేపట్టడం లేదు. దీంతో మురుగు పారాల్సిన బొండాడ మేజర్ డ్రెయిన్ ఎగదన్నడంతో చేలల్లో నీరు అలాగే ఉండిపోయి పంట కుళ్లిపోతుంది.

నిమ్మల కేశవకుమార్, ఎంపీటీసీ ఉప్పులూరు, ఉండి మండలం

ఆక్వాకు ఎదురుదెబ్బ



బొండాడ మేజర్ డ్రెయిన్‌లోకి మురుగునీరు విడిచిపెట్టాలి ఎప్పుడైనా తుఫాన్, లేదా వర్షా కాలంలో ఆక్వా చెరువుల్లోని నీరు బయటకు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. మురుగునీరు వేగంగా ప్రవహిస్తేనే ఆక్వా చెరువులు, వరి పొలాలను ముంపు నుంచి కాపాడుకోగలం. అందుకే అక్విడెక్టు నిర్మాణం తప్పకుండా చేపట్టాలి.

వర్రే పైడియ్య, మాజీ ఎంపీటీసీ, పాములపర్రు, ఉండి మండలం

దళారులను నమ్మొద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

వీరవాసరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యాన్ని సంబంధిత ఆర్ఎస్‌కేల ద్వారా రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పెనుమంట్ర, ఇరగవరం మండలాల్లో పర్యటనలో భాగంగా మార్గం మధ్యలో వీరవాసరం రైల్వేగేట్ సమీపంలో ధాన్యం పట్టుబడులు, వాహనాల్లో లోడింగ్‌ను గమనించి రైతులు వద్దకు వెళ్లి మాట్లాడారు. వాతావరణం అనుకూలంగా లేని కారణంగా కల్లాల్లో ధాన్యం నిల్వ ఉంచవద్దని వెంటనే రైతు సేవ కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించుకోవాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని జేసీ సూచించారు.

కాలం చెల్లిన ఆహారం అమ్మకం



బూజుపట్టిన పచ్చడిని గుర్తించిన నగర పంచాయతీ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.సాకేత్

ఆకివీడు: యూజర్ చార్జీల వసూళ్లకు వెళ్లిన నగర పంచాయతీ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.సాకేత్‌కు చేదు అనుభవం ఎదురైంది. స్థానికంగా మంగళవారం ఒక మార్టులో పచ్చడి కొనుగోలుకు సీసాను పరిశీలించగా బూజుపట్టి, కాలాతీతమైపోయి ఉన్న విషయాన్ని ఆయన గుర్తించారు. అదే మార్టులో కుళ్లిపోయిన అరటి పండ్లపై ఈగలు వాలడాన్ని గుర్తించి సంబంధిత షాపు సూపర్‌వైజర్‌పై సాకేత్ మండిపడ్డారు. శానిటరీ ఇన్‌చార్జి ఏమీ చేయలేక తిరుగు ముఖం పట్టారు. గత కొన్నేళ్లుగా పట్టణంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు కొరవడ్డాయి. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నగర పంచాయతీ అధికారులు గాని, మండల స్థాయి రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం గాని ఫుడ్ సేఫ్టీపై ఏ విధమైన తనిఖీలు చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆకివీడు పట్టణం వైపు జిల్లా అధికారులైనా ఒక్కసారి కన్నెత్తి చూడాలని పలువురు కోరుతున్నారు.

బూజుపట్టి, కాలం చెల్లిన పచ్చడి సీసా →



కబేళాకు మోక్షం



కబేళాను శుభ్రం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని కబేళాకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. మంగళవారం శానటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ టి.సాకేత్ స్థానిక గంగానమ్మ కోడు వీధిలో ఉన్న కబేళాను పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న ఆక్రమణలను తొలగించి, కబేళా రేకు షెడ్డును శుభ్ర చేయించారు. గత కొంత కాలంగా కబేళాలో మేకలు, గొర్రెలను కోయాల్సి ఉండగా, స్థానిక మాంసం దుకాణదారులు కబేళాకు వెళ్లకుండా ఆయా ప్రాంతాల్లో వాటిని వధించి మాంసం విక్రయిస్తున్నారు. దీనిపై స్థానికులు అనేక సార్లు ఫిర్యాదు చేశారు. కబేళా ప్రాంతం కూడా వర్షాలకు, ముంపు నీటికి గురై దుర్గంధభరితంగా ఉందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు చేశారు. దీనిని వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తులు చేశారు. ఎట్టకేలకు కబేళా ప్రాంతం వినియోగంలోకి రావడంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కబేళా ద్వారా నగర పంచాయతీకి ఏటా రూ.30 వేల నుంచి రూ.80 వేల ఆదాయం వస్తుంది.

సుబ్బారాయుడికి అభిషేకం



సుబ్బారాయుడి అభిషేకానికి కావిళ్లతో పంచామృతం తీసుకొస్తున్న భక్తులు

ఆకివీడు: పంచామృతాలు నింపిన బిందెలతో సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకం చేసేందుకు భక్తులు మంగళవారం కావిళ్లతో తీసుకొచ్చారు. వనువులమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి సుమారు 30 మంది భక్తులు కావిళ్లతో బయలు దేరారు. స్థానిక పిల్లలమర్రి అగ్రహారం శివాలయం, మాదివాడ మల్లన్న, భీమేశ్వరస్వామి, పెద్దింటి అమ్మ వార్ల ఆలయాలకు ప్రదర్శనగా వెళ్లి దర్శించుకున్నారు. అనంతరం ప్రదర్శనగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వామికి అఖండ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 2,500 మంది భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. రెండున్నర శతాబ్దాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి చరిత్రలో షష్ఠి ఉత్సవం అఖండ వైభవోపేతంగా ఐదు రోజుల పాటు నిర్వహించడం ఇదే ప్రథమమని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నేరెళ్ల రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మోరా జ్యోతి, శ్రీనివాసరెడ్డి, మోటుపల్లి రామకృష్ణ, మన్నే పోతరాజు, కిమిడి నాగరాజు, గుర్రం సత్యనారాయణ, సన్నిధి మాణిక్యాలరావు, ఓలేటి శ్రీనివాసరావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి



జువ్వలపాలెంలో పువ్వుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



భీమవరం ఏఆర్‌కేఆర్ మునిసిపల్ స్కూల్ వద్ద ర్యాలీ చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం జువ్వలపాలెం రోడ్డులోని పువ్వుల దుకాణాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పువ్వులు కొనేందుకు పువ్వులు అడగ్గా క్యారీ బ్యాగులో పువ్వుల్ని వేసి ఇవ్వడంతో దుకాణ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకం నిషేధంలో ఉండగా ప్లాస్టిక్ కవర్లు ఎందుకు వాడుతున్నావు అని గట్టిగా నిలదీశారు. ప్లాస్టిక్ వాడిన, అమ్మిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని భారీ జరిమానా, ఐదు సంవత్సరాలు జైలు శిక్ష విధించటం జరుగుతుందని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకం వలన అనేక అనర్థాలు జరుగుచున్నాయని ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించబడిందని ఇకపై తినుబండారాలు షాపులు, హోటల్స్, ప్లాస్టిక్ కవర్లు స్వీట్ షాపులు, ఫ్లవర్ డెకరేషన్ షాపులు తదితర షాపులు తరచూ తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. తనిఖీల్లో ప్లాస్టిక్ వాడుతున్నట్లు నిర్ధారణ అయితే వారికి భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో అరికట్టాలి

భీమవరం: పట్టణాలు, గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో అరికట్టాలని దీనికి ప్రజలంతా సహకరించాలని భీమవరం మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఏఆర్ కేఆర్ మున్సిపల్ హైస్కూల్లో మునిసిపాల్టీ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన అవగాహన ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిర్మూలన సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, అనారోగ్యం, ప్రాణాంతకమని తెలిసి కూడా ప్లాస్టిక్ వాడకం దారుణమన్నారు. అనంతరం విద్యార్థులతో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, హైస్కూల్ హెచ్ఎం ఎ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు పలు చట్టాలు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అంబేడ్కర్

భీమవరం: మానవ హక్కుల పరిరక్షణకు వివిధ చట్టాలున్నాయని ప్యానల్ న్యాయవాది పి అంబేద్కర్ అన్నారు. మంగళవారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా భీమవరం మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని 33వ వార్డు సచివాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు రూపొందించబడ్డాయని రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు మానవ హక్కుల పరిధిలోకి వస్తాయన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో మానవ హక్కుల పరిరక్షణ సంస్థలున్నాయని మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే ఆ సంస్థలను సంప్రదించవచ్చనని అంబేడ్కర్ చెప్పారు. ఈ సదస్సుకు ప్యానల్ న్యాయవాది డి రవికిరణ్, పారా లీగల్ వలంటీర్ వి శ్రీలక్ష్మి, అడ్మిన్ సెక్రటరీ వై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి వినికిడి యంత్రం అందజేత

భీమవరం(ప్రకాశంచౌక్): విద్యార్థులు బాగా చదివి పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి చెప్పారు. డిసెంబర్ 7న తణుకు జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్ టీచర్ ఆత్మీయ సమావేశానికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థి బి.రామ్ చరణ్ వినికిడి సమస్యతో బాధపడుతున్నాడని, వినికిడి యంత్రం అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, వెంటనే విభిన్న ప్రతిభావంతుల కార్యాలయానికి మాట్లాడి వినికిడి యంత్రాన్ని తెప్పించి జేసీ ఛాంబర్ నందు రామ్‌చరణ్‌కు అందజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భీమవరం: మోటారుసైకిల్‌పై వెళుతూ ప్రమాదావశాత్తు పడిపోయి తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతిచెందినట్లు భీమవరం టుటౌన్ ఏఎస్ఐ ఎం మోహనరావు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన కౌరు మణికంఠ(21) గత నెల 26వ తేదిన మోటారుసైకిల్‌పై వెళుతూ ప్రమాదావశాత్తు పడిపోయాడు. గాయపడిన మణికంఠను చికిత్సకోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా మృతి చెందాడన్నారు. మృతుని తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మోహనరావు చెప్పారు.

ధాన్యం కొనేదెప్పుడు?

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం!
- రైతులకు గాలం వేస్తున్న దళారులు
- ముమ్మరంగా వరి కోతలు



రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

వీరవాసరం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో నియోజకవర్గంలో జాప్యం నెలకుంది. అధికారులు ఇప్పటివరకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించలేదు. దీంతో దళారీలు రైతులకు గాలం వేస్తున్నారు. పూర్తిస్థాయిలో వరికోతలు కాలేదనే కారణంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. అలాగే పొలాల్లో ధాన్యం రాశులు ఉండడం కనిపిస్తోంది. దీంతో అప్పుడే దళారులు రైతులను ఆశ్రయించి దగా చేయాలని చూస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిబంధనలు తీసేశారు. మద్దతు ధర వస్తే మిల్లర్లు, బయట ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద అమ్మకాలు చేసుకోవచ్చేనే ప్రభుత్వ నిబంధనలు రైతులకు మంచి చేస్తాయో..నష్టం కలిగిస్తాయో..ఎటు వైపు దారి తీస్తాయో వేచి చూడాలి. ఇప్పటికే వీరవాసరం, భీమవరం అర్బన్, పాలకోడేరు, తదితర మండలాల్లో ఒక వైపు ముమ్మరంగా వరికోతలు జరుగుతున్నాయి.

ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగదు

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. బయట కనీస మద్దతు ధర ఉంటేనే అమ్మకాలు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అంతా సిద్ధం చేశాం. వరి కోతలు పూర్తైతే యుద్ధ ప్రతిపదికన ధాన్యం కొనుగోలు చేస్తాం. ఈ విషయంలో దిగువ స్థాయి అధికారులతో గట్టి చర్యలు చేపడుతున్నాం. ధాన్యం అమ్మకాలు చేసిన 48 గంటల్లోనే రైతులకు డబ్బులు జమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

ఏవీ రామాంజనేయులు, తహసీల్దార్, వీరవాసరం

దళారుల దోపిడీ కోసమే జాప్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో జరుగుతున్న జాప్యం కేవలం మిల్లర్లు, దళారులకు లాభం కలిగించడానికే అనే అనుమానం వస్తోంది. ఇప్పటికే కొంతమంది దళారులు రైతులను ఆశ్రయించి దగా చేయాలని చూస్తున్నారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలి.